# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 14-01-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

❖ ప్రకృతితో మమేకమయ్యే జీవన విధానానికి పొంగల్ పండుగ స్ఫూర్తినిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

❖ సాయుధ దళాల మాజీ సైనికులు జాతీయ చైతన్యానికి సజీవ స్తంభాలుగా నిలిచారని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

❖ స్వయం సమృద్ధ ఇంధన రంగం దిశగా భారత్ ఒక కీలక మైలురాయిని సాధించిందని కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరి చెప్పారు.

❖ భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య రాజ్ కోట్ వేదికగా జరుగుతున్న మూడో వన్డే మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగుతోంది.

========================

ప్రకృతితో మమేకమయ్యే జీవన విధానానికి పొంగల్ పండుగ స్ఫూర్తినిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ నివాసంలో ఈరోజు ఏర్పాటు చేసిన పొంగల్ వేడుకల్లో ప్రధానమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేడుకలను ఉద్దేశించి ప్రసంగిస్తూ... సజీవమైన తమిళ సంస్కృతి యావత్ దేశానికి చెందిన ఉమ్మడి వారసత్వమని కొనియాడారు. నేడు పొంగల్ ఒక ప్రపంచ పండుగగా మారిందని నరేంద్ర మోదీ మాట్లాడుతూ...

(వాయిస్ 32 సెకన్లు)

ఇదే సమయంలో దేశంలోని వివిధ ప్రాంతాలు కూడా లోహ్రీ, మకర సంక్రాంతి, మాఘ బిహు వంటి పండుగలు జరుపుకుంటున్నాయని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా దేశ విదేశాల్లోని భారతీయులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇక తమిళ సంస్కృతి ప్రకారం రైతును తమిళుల జీవనవిధానానికి పునాదిగా భావిస్తారని చెప్పారు. రైతులను శక్తివంతంగా మార్చడానికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం నిబద్ధతతో పని చేస్తోందని

తెలిపారు. దేశంలో వ్యవసాయాన్ని పర్యావరణానికి అనుకూలంగా మార్చడానికి రాబోయే కాలంలో స్థిరమైన వ్యవసాయ పద్ధతులు, నీటి నిర్వహణ, సహజ వ్యవసాయం వంటి పద్ధతులను విస్తృతంగా అందుబాటులోకి తీసుకువస్తామని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

సాయుధ దళాల మాజీ సైనికులు జాతీయ చైతన్యానికి సజీవ స్తంభాలుగా నిలిచి భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిస్తున్నారని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. న్యూఢిల్లీలో జరిగిన సాయుధ దళాల మాజీ సైనికుల దినోత్సవాన్ని ఉద్దేశించి రక్షణ మంత్రి ఈరోజు మాట్లాడుతూ... మాజీ సైనికులు వారి క్రమశిక్షణ, నాయకత్వం, ధైర్యం సమాజానికి మార్గనిర్దేశం చేస్తాయని, దేశ నిర్మాణంలో తోడ్పడతాయని చెప్పారు. మాజీ సైనికుల యూనిఫాం, పని ప్రదేశం మారవచ్చేమో కానీ వారి హృదయాలలో దేశభక్తి, సేవా భావన అలాగే ఉన్నాయని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

స్వయం సమృద్ధ ఇంధన రంగం దిశగా భారత్ ఒక కీలక మైలురాయిని సాధించిందని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖా మంత్రి హర్దీప్ సింగ్ పూరి తెలిపారు. ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రో రిసోర్సెస్ లిమిటెడ్ల సంయుక్త ప్రాజెక్ట్ అయిన ఊర్జా భారత్ పీ.టీ.ఈ. లిమిటెడ్ అబుదాబిలోని ఆన్‌షోర్ బ్లాక్-1లో తేలికపాటి ముడి చమురును విజయవంతంగా కనుగొందని హర్దీప్ సింగ్ పూరి సామాజిక మాధ్యమం పోస్ట్‌లో తెలియజేశారు. ఇటువంటి అంతర్జాతీయ భాగస్వామ్యాలు భారతదేశ ఇంధన భద్రతను మరింత బలోపేతం చేస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ విజయం భారతీయ సంస్థల సాంకేతిక నైపుణ్యం, అంకితభావాన్ని ప్రతిబింబిస్తుందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 130వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 23వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

లక్ష ద్వీప్‌లోని కవరట్టిలో ఉమ్మడి సాయుధ దళాల మల్టీ-స్పెషాలిటీ వైద్య శిబిరాన్ని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. అనంతరం ప్రసంగిస్తూ.. భారత నావికాదళం నిర్వహిస్తున్న ఈ భారీ వైద్య శిబిరం `స్వస్త్ భారత్` దార్శనికతను ముందుకు తీసుకువెళ్తుందన్నారు. మారుమూల ప్రాంతాలలోని పౌరులకు సైతం నాణ్యమైన ఆరోగ్య సంరక్షణను చేరువ చేస్తుందన్నారు. సమగ్ర స్క్రీనింగ్, ముందస్తు రోగ నిర్ధారణ, సకాలంలో వైద్య సలహా, ఉచిత మందుల పంపిణీ మొదలగు ఆరోగ్య ప్రయోజనాలను ఈ వైద్య శిబిరం అందిస్తుందని రాజ్ నాథ్ సింగ్ పేర్కొంటూ...

(వాయిస్ 34 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

కృత్రిమ మేధస్సుకు సంబంధించి వచ్చే నెలలో "ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్" కు భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈ విషయాన్ని ఈరోజు వెల్లడించారు. ఐఐటీ మద్రాస్ లో పొంగల్ వేడుకలకు హాజరయ్యేందుకు నగరానికి వచ్చిన ఆయన సంస్థ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ... విద్య, ఆరోగ్య సంరక్షణ వంటి రంగాలలో కృత్రిమ మేధస్సు (ఏఐ) ప్రపంచ వ్యాప్త వినియోగం రోజు రోజుకు పెరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. దేశ విద్యా విధానంలో కృత్రిమ మేధను అంతర్భాగంగా చేస్తామని మంత్రి ప్రకటించారు. పాఠశాల స్థాయి విద్య నుండి ఉన్నత పరిశోధనల వరకు, అన్ని భారతీయ విద్యా సంస్థలలో బోధనా మాధ్యమంగా మాతృభాషకు ప్రాధాన్యత ఉంటుందని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత నౌకాదళానికి చెందిన ఐఎన్ఎస్వీ కౌండిన్య అరుదైన ఘనత సాధించింది. ఇటీవల గుజరాత్‌లోని పోరుబందర్ నుంచి బయల్దేరిన 'ఐఎన్ఎస్వీ కౌండిన్య' ఒమన్ రాజధాని మస్కట్ లోని పోర్ట్ సుల్తాన్ కాబూస్ కు ఈరోజు విజయవంతంగా చేరుకుంది. ఎటువంటి ఇంజన్ లేకుండా పూర్తిగా తెరచాపల సహాయంతో పయనించి తన గమ్యాన్ని చేరింది. గత డిసెంబర్ 29న ప్రారంభమైన ఈ నౌక దాదాపు 1,400 కిలోమీటర్ల ప్రయాణాన్ని17 రోజుల్లో పూర్తి చేసింది. మస్కట్‌కు చేరుకున్న అనంతరం ఓడలోని సిబ్బంది సంబరాలు చేసుకున్నారు. అజంతా గుహల్లోని 5వ శతాబ్దం నాటి పెయింటింగ్‌లోని ఒక నౌక నుంచి ప్రేరణ పొందిన ఆధునిక భారత నిపుణులు.. 'ఐఎన్ఎస్వీ కౌండిన్య' రూపంలో దానిని పునఃసృష్టించారు. దీని నిర్మాణంలో పురాతన విధానాలనే అవలంబించడం గమనార్హం. దాదాపు 2 వేల సంవత్సరాల క్రితం హిందూ మహాసముద్రంలో భారతీయ నావికులు అనుసరించిన సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా కొబ్బరి తాడు, సహజ రబ్బర్ ను ఉపయోగించి ఈ నౌక తెరచాపలను అల్లారు. అందువల్ల ఈ నౌకను 'స్టిచ్డ్ షిప్'గా కూడా పిలుస్తారు. సముద్ర ఉప్పునీటి నుంచి రక్షణ కోసం దీనికి సహజసిద్ధ జిగురుపూతను వేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య రాజ్ కోట్ వేదికగా జరుగుతున్న మూడో వన్డే క్రికెట్ మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగుతోంది. 285 పరుగుల లక్ష్య ఛేదనలో న్యూజిలాండ్ 36 ఓవర్లు పూర్తయ్యేసరికి 2 వికెట్లు నష్టపోయి 200 పరుగులు చేసింది. విజయానికి ఇంకా 84 బంతుల్లో 85 పరుగులు చేయాల్సి ఉంది. న్యూజిలాండ్ బ్యాట్స్‌మెన్ డేరిల్ మిచ్చెల్, విల్ యంగ్ 154 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పి జట్టుని విజయం వైపుగా తీసుకెళ్తూ క్రీజ్ లో కొనసాగుతున్నారు. అంతకముందు కేఎల్ రాహుల్ సెంచరీతో రాణించడంతో భారత్ 284 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 83 వేల 627పాయింట్ల వద్ద నష్టాలతో ప్రారంభమై... చివరికి 245 పాయింట్ల నష్టంతో 83 వేల 382 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 66 పాయింట్లు నష్టపోయి 25 వేల 665 వద్ద ముగిసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = =